

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

"**అలా అయితే** నాన్నగారికి 'గుడ్ బై' చెప్పి వస్తాను."

చెయ్యి పట్టుకుని ఆపింది నీరజ.

"నిద్రపోతున్నారు. లేపితే కోపం వస్తుంది."

గుమ్మంలో నిలబడ్డ దశరధరామయ్యతో చెప్పాడు రాజేష్.

"వెళ్ళొస్తా తాతయ్యా"

"మంచిది నాయనా"

వంగి రాజేష్ రెండు బుగ్గలమీద ముద్దు పెట్టుకున్నాడు ఆయన.

"తాతయ్యా! నువ్వు నాకు ఒక్క కథకూడా చెప్పనేలేదు"

ఆయనకి మనసంతా ఎంతో వెలితిగా వుంది. రాజేష్ వెళ్ళిపోతున్నందుకు కాదు. రాజేష్ వచ్చి సరిగ్గా ఇరవైనాలుగు గంటలు కూడా కాకపోయినా, ఆ కుర్రాడు ఆయన మనస్సుకి బాగా దగ్గిరయ్యాడు. ఆ వయసులో 'తాతయ్య' అని పిలిపించుకుంటే పొందే మానసికానందాన్ని ఆయనకి రుచి చూపించడం బలమయిన కారణం.

"జాగ్రత్త నాయనా. పెద్దవాడయ్యాక ఈ తాతయ్యని గుర్తుంచుకుని ఓసారి రా."

"అలాగే తాతయ్యా. మరి నువ్వు చుట్టలు మానేస్తేనే."

పక్కింటి బన్ని పరిగెత్తుకొచ్చింది.

"ఎక్కడికి?" అడిగింది ఆదుర్దాగా.

"అబ్బా! ఎక్కడకని అడగకూడదు. వెళ్ళిన పనికాదు" విసుక్కుంది నీరజ.

"ఏం పనిమీద వెళుతున్నారు?" అడిగింది బన్ని మళ్ళీ.

"మా ఊరు వెళుతున్నాం. టాటా" చెప్పాడు హుషారుగా.

"టాటా. అప్పుడే వెళ్ళిపోతున్నావే?" అడిగింది బన్ని.

"వెళ్ళొస్తాం మామయ్యగారూ" చెప్పింది నీరజ.

ఆయన మౌనంగా తలాడించాడు. నీరజకి అంత ఉదయం బస్ దొరకలేదు. సిటీ బస్‌లో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకుంది. టికెట్స్ తీసుకుని కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో కూర్చుంది. రాజేష్ కిటికీ ప్రక్క సీట్‌లో కూర్చున్నాడు.

రైలు బయలుదేరాక ఆమెకి క్షణకాలం అనిపించింది. తన నిర్ణయం సబబైనది కాదేమోనని ఇక ఏం ఆలోచించకూడదని ఇంటినించి తెచ్చుకున్న ఈవ్స్ వీక్లీ తెరిచింది.

దాదాపు అరగంట దాకా నీరజ పుస్తకం చదువుతూ, రాజేష్ కిటికీలోంచి బయటకి చూస్తూ గడిపారు. టి.సి వచ్చి టిక్కెట్స్ తనిఖీ చేస్తున్నాడు.

"హలో అంకుల్. హౌ ఆర్ యు?" పలకరించాడు రాజేష్ టి.సి.ని గుర్తుపట్టి.

టి.సి.కి క్రితం రోజు ఉదయం విజయవాడ నుంచి వస్తూ తను ఆ కుర్రాణ్ణి దింపేసిన సంఘటన గుర్తుకొచ్చింది.

"నీకీయన ఎలా తెలుసు?" ఆతృతగా అడిగింది నీరజ అతడిని.

టి.సి ఆమె ఇచ్చిన రెండు టిక్కెట్లని తనిఖీ చేసి ఇచ్చి క్రితం రోజు జరిగిన విషయాలు చెప్పాడు.

అప్రయత్నంగా ఆమె చెయ్యిని కవచంలా రాజేష్ నడుం చుట్టూ వేసింది. అతను మళ్ళీ రైలు ఎక్కకుండా వుండివుంటే ఏమయ్యేవాడు అని ఆలోచిస్తేనే ఆమె ఒళ్ళు జలదరించింది.

"రాజేష్ తల్లిని చూసారా మీరు?" అడిగింది టి.సి.ని.

"లేదు"

టి.సి వెళ్ళిపోయాడు.

మరో అరగంట దాటాక నీరజ పుస్తకం చదవడం అయిపోయింది. రాజేష్‌కి కిటికీలోంచి బయటకి చూస్తూంటే విసుగ్గా వుంది.

"నీకు బంధువులెవరూ లేరా రాజేష్?" అడిగింది నీరజ.

"లేరు పిన్నీ" జవాబు చెప్పాడు.

"విజయవాడలో కాకపోయినా, బయట వూళ్ళలో ఎవరూ లేరా? మామయ్యకానీ, బాబాయికని, అత్తయ్య, పిన్ని.. ఎవరూ లేరా?"

"లేరు."

కాసేపు నిశ్శబ్దంగా వున్నారు. అతను అట్టపెట్టెలోంచి ఉడతని తీసి భుజం మీదకి ఎక్కించుకున్నాడు. దాని మెడకి కట్టివున్న చిన్న కాగితం మీద స్కెచ్‌తో అందంగా రాసివుంది.

నా పేరు టింకూ.

నా యజమాని పేరు రాజేష్

"ఇదెక్కడిది నీకు?" అడిగింది.

"ఓ రోజు నేను, అమ్మ పిక్నిక్‌కి వుండవల్లి వెళ్ళాం. ఇంటినుంచి చేసి తెచ్చుకున్న సాంబారు అన్నం, పెరుగన్నం తింటూంటే ఇది పరిగెత్తుకుంటూ మా దగ్గరికి వచ్చింది. పెద్ద రాబందు దీని మీదకి వస్తోంది. దీన్ని నోరు కరచుకుని ఎగిరిపోతుంది మేం చూస్తుండగానే. నేను నా చేతిలోని సాంబారు అన్నాన్ని ఆ రాబందు మీదకి విసిరాను. భయపడిపోయి

దీన్ని వదిలేసింది ఆ పక్షి. వెంటనే మేం దీన్ని రక్షించాం. వంటినిండా గాయాలే. దాన్ని అక్కడ వదిలేస్తే మళ్ళీ ఏ ముప్పు వస్తుందో అని ఇంటికి తీసుకొచ్చాం. అప్పటినుంచి దీన్ని నేనే పెంచుతున్నాను.

"నీ దగ్గర బాగా అలవాటులావుందే దీనికి"

"అవును."

"నిన్ను పొడిచి పారిపోదా?"

"ఊహూ. ఎప్పుడైనా బయటకి వెళుతుంది ఏ చెట్టుమీదకో. వెంటనే వచ్చేస్తుంది."

"టింకు పేరు ఎవరు పెట్టారు?"

"అమ్మ."

"మీ అమ్మకి ఎన్నేళ్ళు?"

"ఏమో?"

కాసేపు మౌనంగా వుండిపోయారిద్దరూ.

"నెలకో ఆదివారం అమ్మా, నేను పిక్నిక్‌కి వెళతాం. ప్రొద్దున్నే వెళ్ళి మళ్ళీ చీకటి పడుతుండగా వచ్చేస్తాం."

"ఎక్కడికి?""చాలా చోట్లకి. కృష్ణానది వడ్డుకి, మంగళగిరికి, ముత్యాలంపాడు దాటాక తెలిసినవాళ్ళ మామిడితోటకి, ఇంక..."

"ఎవరిదా మామిడితోట?"

"తెలిసిన వాళ్ళది."

"ఎవరికి తెలిసినవాళ్ళది?"

"అమ్మకి, నాకు."

"పేరు?"

"శేషావతారం."

"ఎలా తెలుసు మీకు?"

"ఎలా తెలుసేమిటి? వాడు నా క్లాస్‌మేట్. వాళ్ళ నాన్నగారికి బోలెడంత డబ్బుంది. క్లాసు పిల్లలు చాలామంది వాళ్ళ తోటకి వనభోజనాలకి వెళుతూంటారు"

"అంతేనా?"

రైలు కాజీపేటలో ఆగింది. దిగివెళ్ళి నీరజ భోజనం పొట్లాటలు, సీసాలో నీళ్ళు తెచ్చింది. ఆకలిమీద వున్నట్లున్నాడు. రాజేష్ మొహమాటపడకుండా తిన్నాడు.

"నేను ఓ సంగతి చెపితే మీకు కోపం రాదుగా?" అడిగాడు రాజేష్ ఇద్దరి భోజనాలయ్యాక.

"చెప్పు."

"మీరు, నాన్నగారు, తాతయ్య అన్నం తినేటప్పుడు అలా చప్పుడయ్యేలా తింటారెందుకు?"

"అంటే?"

అభినయం చేసి చూపించాడు రాజేష్.

"అమ్మ నేనలా తింటే కోప్పడేది. శబ్దం రాకుండా తినడం మంచి లక్షణం అని చెప్పేది. పెదవులు విడిపోకుండా కలిసి వుంచి తింటే చప్పుడు కాదు."

నీరజ మనసులోనే సిగ్గుపడింది.

"మీ అమ్మని నిజంగా చూడాలనిపిస్తోంది" చెప్పింది. రాజేష్‌ని ఆమె పెంచిన విధం, వాడి ప్రవర్తనలో అడుగడుగునా కనిపిస్తోంది. సంస్కారం చిన్నప్పటినించే నేర్పితేనే వచ్చేది.

"మీరేం అనుకోకపోతే ఓ అరిటిపండు కొనిపెట్టరా?" అడిగాడు.

"అలాగే"

దిగి వెళ్ళి అరడజను అరటిపండ్లు తెచ్చింది నీరజ. రాజేష్ తినడానికనుకుంది. కాదు టింకూకి పెట్టడానికి.

రైలు బయలుదేరాక అరగంటదాకా నిద్రపోయాడు రాజేష్. మెలుకువ వచ్చాక అడిగాడు.

"ఏదైనా కథ చెప్పరా?"

"నాకు రావు. నీకు తెలిస్తే చెప్పు."

"చెప్పనా?" ఉత్సాహంగా అడిగాడు.

"చెప్పు."

కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"అనగనగా ఒక వూళ్ళో వంకాయ, సొరకాయ, బెండకాయ, కేబేజీ కలుసుకుని పందెం వేసుకున్నాయి. ఎవరు ఎక్కువ నడవగలరా అని. ఒక చెట్టునుండి ఇంకో చెట్టు దగ్గరికి నడిచి వెళ్ళి మళ్ళీ ఆ చెట్టు దగ్గరికి తిరిగి రావాలి. నాలుగూ వరసగా నిలబడ్డాయి. ఒన్, టు, త్రీ, ఫో చెప్పగానే అవి నడవడం మొదలుపెడతాయన్నమాట. ఒన్..టు...త్రీ...ఫో..ఇప్పుడు అవి నడుస్తున్నాయి. ముందర వంకాయ, బెండకాయ నడిచి ఆ చెట్టు దగ్గరికి వెళ్ళాయి. తర్వాత కేబేజి, సొరకాయ తిరిగి వచ్చేటప్పుడు అందరికన్నా ముందే కేబేజీ వుంది. దాని వెనక సొరకాయ, బెండకాయ, వంకాయ అన్నమాట. కానీ అన్నిటికన్నా ముందు సొరకాయ వచ్చి చెట్టుని ముట్టుకుంది. తర్వాత కేబేజి సెకండ్ వచ్చింది. థర్డ్ బెండకాయ, ఫోర్త్ వంకాయ."

ఆగి ఎలా వుందన్నట్టుగా చూశాడు.

"సొరకాయకి బరువు ఎక్కువ కదా? అంత త్వరగా ఎలా రాగలిగింది? బెండకాయో, వంకాయో ముందు రావాలి కదా?" అడిగింది నీరజ. "నాకు సొరకాయ కూరంటే బాగా ఇష్టం కాబట్టి అదే ముందు వచ్చింది. "

అమాయకంగా చెప్పిన ఆ మాటలకి నీరజ నవ్వి అడిగింది.

"సొరకాయ కూర ఇష్టమా నీకు?"

"అవును. మొదట్లో నాకు ఇష్టం వుండేదికాదు. సొరకాయ వండినప్పుడల్లా అమ్మ ఈ కథ చెప్పి నా చేత తినిపించేది. అది తింటే సొరకాయలా వేగంగా నడవగలనని చెప్పేది. దాంతో అది తింటూండేవాడిని. అందుకే అదంటే యిష్టం."

రాజేష్ తల్లి నిజమైన చైల్డ్ సైకాలజిస్టు అనుకుంది నీరజ మనస్సులో. తనకి పిల్లలు పుట్టాక వాళ్ళు ఏదైనా తిననని మారాం చేస్తే తనూ ఈ కథని.. ఎందుకో నీరజ మనసు బాధతో గిలగిలలాడింది ఆ ఆలోచనకి.

పెళ్ళయి సరిగ్గా మూడువారాలు కూడా కాలేదు. ఎలాంటి సమస్య వచ్చి పడింది. ఆడది కాబట్టి తను సర్దుకుపోవాలి. ఇదే మగాడయితే? తనకి పెళ్ళికి ముందు రాజేష్‌లాంటి కొడుకుండి, ఆ సంగతి దాచితే? పెళ్ళయ్యాక బయటపడితే ఎలా వుంటుంది ఆయన ప్రవర్తన? అచ్చం మగాడి ప్రవర్తనలా వుంటుంది. మగవాళ్ళు సర్దుకుపోలేరు, ఆడవాళ్ళే ఎందుకు భరించాలి?

"ఇంకో కథ చెప్పనా?" అడిగాడు రాజేష్.

"చెప్పు"

"మా అమ్మకి బోలెడు కథలు వచ్చు. ఇది మా అమ్మ చెప్పింది. మీ ఊరు రాబోయే ముందు రోజు రాత్రి దోమలు కుడుతున్నాయంటే.

"అనగా అనగా ఓ ఊళ్ళో ఓ అడవి.."

"అడవెక్కడైనా వూళ్ళో వుంటుందా?" నవ్వుతూ అడిగింది నీరజ.

నాలిక్కొరుక్కున్నాడు రాజేష్.

"ఊళ్ళోకాదు. ఓ చిన్న ఊరి పక్కన ఓ పెద్ద అడవి వుందన్నమాట. అందులో రాత్రి అన్ని జంతువులూ నిద్రపోతున్నాయి. ఏనుగులకు అకస్మాత్తుగా పెద్ద ఉరుములా అరుపు వినిపించింది. ఆ అరుపుకి నిద్ర పోతున్నవన్నీ ఉలిక్కిపడి లేచాయి. ఏమిటా అరుపు అని తెలుసుకుంటే సింహం గర్జించింది. ఆ అడవిలోని ఓ దోమకి కూడా సింహం గర్జనతో మెలుకువ వచ్చింది. నిద్రలో మంచి కలకూడా కంటోంది మరి. దాంతో కోపం వచ్చి సింహాన్ని శిక్షించాలనుకుని `అది నా దగ్గరకు వస్తే దానిపని పడతాను` అనుకుంది. సింహం అటూ ఇటూ తిరుగుతూ కాసేపటికి ఆ దోమ ఇంటివైపు వచ్చింది.

"ఓసీ సింహమా! అనవసరంగా అర్ధరాత్రి అరిచి ఎందుకు మమ్మల్ని హింసపెడతావ్?" అని అడిగింది దోమ కోపంగా.

"పోవే ఓ చిన్న దోమా? నేను అడవికి రాజుని. నా ఇష్టం వచ్చినప్పుడల్లా గర్జిస్తాను" అని మళ్ళీ గట్టిగా గర్జించింది సింహం.

దోమకి కోపం వచ్చి ఒక్క ఎగురు ఎగిరి సింహం మూతి మీద కుట్టింది. సింహం బాధగా అరిచి దోమని పంజాతో కొట్టాలనుకుంది. దోమకి ఎగరటం వచ్చుగా. సింహానికి అందకుండా పైన ఎగురుతూ మళ్ళీ వచ్చి సింహం తోకనో, పొట్టనో

కుడుతూంటే సింహం బాధతో మీదపడి దొర్లింది. "వద్దు. వద్దు. నన్ను వదిలిపెట్టు" అని బతిమాలింది. దోమ పోనీలే పాపం అని తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

పొద్దున్నే ఆ దోమ నిద్రలేచి తను సింహాన్ని ఎలా కుట్టి ఏడిపించిందో చెప్పడానికి అందరిళ్ళకీ వెళ్ళసాగింది. ఎలకకి, కుందేలుకి, తాబేలుకి, చేపలకి, నక్కలకి, పిల్లులకి, ఆఖరికి ఏనుగులకి కూడా చెప్పి "మృగరాజునే ఓడించాను. నా అంత బలమయిన వాళ్ళెవరూ లేరు" అందరిముందూ గర్వపడింది.

"ఏం జరిగిందో వచ్చి కాస్త నా చెవిలో కూడా చెప్పు దోమా నాకు చెవుడు, సరిగ్గా వినబడదు" అన్నది సాలీడు.

దోమ సరేనని ఎగిరి దాని దగ్గరకి వెళ్ళింది. పాపం అది సాలీడు అల్లిన సాలెగుడులో చిక్కుకుపోయింది. వెంటనే సాలీడు ఆ దోమని తినేసింది. కానీ సింహాన్ని ఓడించిన దోమని తినేశానహో అని దండోరా వేసుకోలేదు. బావుందా?"

రాజేష్ కంఠంలో లీనమై, పాత్ర సంభాషణని ఆ పాత్రలు చెప్పినట్లుగా రకరకాల భావాలతో చెప్పటం చూస్తే ముచ్చటేసింది నీరజకి.

"చాలా బావుంది" చెప్పింది వాడి బుగ్గలు పుణికి.

"మా అమ్మ ఇంకా బాగా చెపుతుంది. ఎవరికయినా గర్వం అధికం అయితే దోమలా అయిపోతారన్నమాట" చెప్పాడు రాజేష్.

రైలు విజయవాడ చేరుకుంది.

రైల్వే స్టేషన్ నించే తన స్నేహితురాలు సహజ పనిచేసే ఆఫీసుకి ఫోన్ చేసింది.

"ఎప్పుడు రాక?" సహజ ఆనందంగా.

"రైల్వే స్టేషన్ నించి మాట్లాడుతున్నాను. వెంటనే రాగలవా?" అని అడిగింది.

"సాయంత్రందాకా కుదరదు. సెలవు పెట్టడానికి కూడా వీలులేదు. నువ్వు మా హాస్టల్‌కి వెళ్ళు, రెస్ట్ తీసుకో. నాలుగున్నరకల్లా వచ్చేస్తాను పర్మిషన్ తీసుకుని."

సహజ బసచేసే వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌కి రిక్షాకి ఎంతివ్వచ్చో చెప్పింది. అరగంట తర్వాత రాజేష్, నీరజ హాస్టల్ ముందు రిక్షా దిగారు. సహజ హాస్టల్ వాళ్ళకి ఫోన్ చేయడంతో యిబ్బంది లేకపోయింది. ఆయా సహజ గది డూప్లికేట్ తాళం చెవి ఆఫీసులో తీసుకుని గది తెరిచింది.

నీరజ, రాజేష్ ఇద్దరూ స్నానం చేశారు.

'మా ఇంటికెళదాం' అంటున్నాడు రాజేష్ అప్పటికే. బయటకి వచ్చి నీరజ రాజేష్ ఇంటికి రిక్షా మాట్లాడింది.

"నా సామాను?" అడిగాడు రాజేష్ రిక్షా ఎక్కబోయే ముందు.

"మళ్ళీ వద్దాం"

దాదాపు అరగంట తర్వాత రిక్షా ఆగింది. రాజేష్ చెంగున రిక్షా దిగి ఇంటికున్న నాలుగు నాలుగు మెట్లెక్కి మూసివున్న తలుపుమీద దబదబా కొడుతూ ఆనందంగా చెప్పాడు."అమ్మా నే వచ్చేశానమ్మా"

నీరజ చూసింది ఆ ఇంటికున్న తాళం కప్పని.

"మీ ఇంటాయన ఎక్కడ వుండేది?" అడిగింది రాజేష్‌ని.

రాజేష్ వెనకే నాలుగో తలుపులోంచి లోపలికి వెళ్ళింది.

పెరడులోని బాదం చెట్టుకున్న ఆకులని కోస్తున్నాడు ఓ మధ్య వయస్కుడు.

"హలో అంకుల్ తాతం చెవి?" అడిగాడు రాజేష్.

"ఎప్పుడొచ్చారు?" అడిగాడతను రాజేష్‌తో వచ్చిన నీరజ వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

"రాజేష్ మదర్ బయటకి వెళ్ళారా?" అడిగింది నీరజ.

"రండి"

అతను ఇంట్లోకి దారి తీశాడు. బాదం ఆకులతో విస్తళ్ళు కుడుతున్నాడు ఓ ముసలాయన. ఆయనే ఇంటాయన సభాపతి అని గుర్తించింది.

రాజేష్ ఒక్క పరుగున వెళ్ళి ఆ ముసలాయన మెడచుట్టూ చేతులువేసి వీపెక్కాడు.

"సావిత్రిగారు ఇల్లు ఖాళీ చేసేశారండి" చెప్పాడా మధ్యవయస్కుడు.

"రాజేష్ తల్లి పేరు సావిత్రా?" అడిగింది నీరజ వెంటనే.

"అవును. బాబు, తను కలిసి హైదరాబాద్ వెళుతున్నామని చెప్పిందే"

"రాజేష్ ఒక్కడే వచ్చాడు. సావిత్రి హైదరాబాద్ రాలేదు" చెప్పింది నీరజ.

"మరి మాతో అలా అన్నదే"

"ఇల్లు ఖాళీచేసి సామాను ఎక్కడికి తీసుకెళ్ళిందో తెలుసా?"

"మీరెవరు ఇంతకీ?"

"సావిత్రికి నేను..నేను కజిన్ అవుతాను."

"సామానంటూ పెద్దగా ఏం లేదు. వంటసామాను రెండు కార్డ్‌బోర్డ్ పెట్టెల్లో కట్టి మా ఇంట్లోనే వుంచి వెళ్ళింది. తర్వాత తీసుకుంటానని."

"హైదరాబాద్ రాకుండా ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. రాజేష్ కులాసాగా చేరినట్లు టెలిగ్రాం యీ అడ్రసుకే యిమ్మని చెప్పిందే"

"మాతో టెలిగ్రాం సంగతి చెప్పలేదు" వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"అమ్మేది?" బిక్కమొహం వేసి అడిగాడు రాజేష్.

"వస్తుంది" చెప్పింది నీరజ.

"ఒంటరిగా మీ ఇంటికి అంతదూరం పంపిందా రాజేష్‌ని?" ఇంటావిడ ఆశ్చర్యపోయింది.

"సావిత్రి భర్త పేరేమిటి? మేం విడిపోయి దాదాపు పదేళ్ళు దాటుతోంది. మాకు సావిత్రి విషయాలేం కొత్తగా తెలియవు" చెప్పింది నీరజ.

"సావిత్రి భర్త హైదరాబాద్‌లో వుంటున్నాడు. మా ఇంటికి సావిత్రి అద్దెకి వచ్చి నాలుగునెలలే అయింది. తన భర్త గురించి అట్టే చెప్పలేదు. ఆ ప్రసక్తి తీసుకురావడానికి యిష్టపడేదికాదు. వాళ్ళ మధ్య ఏమైనా గొడవలు వుండి వుంటాయనుకున్నాం."

రాజేష్‌ని అక్కడే వుంచి సరాసరి ముత్యాలంపాడులోని సావిత్రి పనిచేసే లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌కి వెళ్ళింది. వేసవికాలం సెలవలివ్వడంవల్ల అది మూసేశారు. ఆఫీస్ స్టాఫ్ మాత్రం వున్నారు.

సావిత్రి గురించి కొత్త వివరాలేం తెలీలేదు అక్కడకూడా. రెండేళ్ళనించి ఆ స్కూల్లో పనిచేస్తోంది. అంతకుమునుపు గుంటూరులో వున్నప్పుడు అక్కడ వుండేది సావిత్రి.

"ఏప్రిల్ పదహారో తారీకునించి శెలవులోవుంది సావిత్రి మేడమ్. పిల్లల పరీక్షలయ్యేదాక శెలవు యివ్వమని హెడ్ మిస్ట్రెస్ చెప్పినా పట్టుబట్టి శెలవు తీసుకుంది. ఆ తర్వాత రాలేదు" చెప్పాడు ఆఫీస్ మేనేజర్.

"ఏ తారీకునించి?" అడిగింది నీరజ అదిరిపడి.

"ఏప్రిల్ పదహారు"

తమ పెళ్ళిరోజునుంచి.

సావిత్రికి తెలుసా తమ పెళ్ళి గురించి? ఎవరికీ చెప్పకుండా ఏమయింది? ఎక్కడికి వెళ్ళింది? కొంపతీసి ఏ ఆత్మహత్యో చేసుకోలేదుకదా? అలాంటిదేమైనా వుంటే తప్పకుండా ఆయనకి ఓ ఉత్తరం రాసి ఉండాలి. ఉత్తరం అందే తనకి చెప్పలేదా ఆయన?

అన్నీ ప్రశ్నలే. జవాబులేని ప్రశ్నలు.

"రాజేష్ టి.సి. తీసేసుకుంది మేడమ్. ఆవిడ స్కూల్స్ తెరిచాక తిరిగిరాదనే అనుకుంటున్నాం. హైదరాబాదులోని భర్తదగ్గరికి వెళ్ళిందని ఎవరో అన్నారు."

నీరజ క్షణకాలం ఆలోచించి అడిగింది.

"రాజేష్ టి.సిలో తండ్రిపేరు ఎవరిది రాసుందో చూసి చెప్పగలరా?"

"మీరెవరు?"

"సావిత్రి కజిన్‌ని. ఏవో కుటుంబ కలహాలవల్ల మా మధ్య రాకపోకలు లేవు. అకస్మాత్తుగా రాజేష్‌ని మాత్రం మా ఇంటికి పంపించింది. సావిత్రిని కూడా తీసుకెళదామని వచ్చాను."

ఆయన లేచి ఓ పుస్తకం తిరగేసి చెప్పాడు.

"సావిత్రి భర్త పేరు సాంబశివరావు."

"ఇంటి పేరు?"

"కె."

నీరజ మనసులో ఎక్కడో వున్న ఆశ, తన భర్త సావిత్రి భర్త కాదని మిణుకు మిణుకుమనే ఆశ ఆ అక్షరం వినగానే ఆరిపోయింది.

లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌నుంచి నీరజ రిక్షాలో సరాసరి హనుమాన్ పేటలో వున్న సభాపతి ఇంటికి చేరుకుంది. ముసలాయన దగ్గర కూర్చుని కబుర్లు చెబుతున్న రాజేష్ పరుగెత్తుకొచ్చి అడిగాడు.

"అమ్మ ఏది పిన్నీ?"

ఊరెళ్ళింది. తర్వాత వస్తుంది" చెప్పింది నీరజ.

రాజేష్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కానీ అంతలోనే తమాయించుకున్నాడు.

"అమ్మ ఎప్పుడూ ఇలా చేయలేదు" గొణిగాడు.

ఇంటాయనని ఎంత తరచి ప్రశ్నించినా కొత్త విషయాలేం తెలియలేదు. సావిత్రి ఎలా అదృశ్యమైనదీ, అసలెందుకు అదృశ్యమైనదీ నీరజకి అంతుచిక్కలేదు.

"నాతో హాస్టల్‌కి వస్తావా? లేక ఈ రాత్రికి ఇక్కడే వుంటావా? అడిగింది నీరజ్ రాజేష్‌ని.

ముందు వుంటానన్నాడు. తర్వాత వస్తానన్నాడు. నీరజ తన చిరునామా వ్రాసి యింటాయనకిచ్చి చెప్పింది. "సావిత్రిగారు ఇక్కడికి వచ్చినా లేక ఆమె గురించి సమాచారం తెలిసినా ఈ చిరునామాకి తెలియచేయండి. దయచేసి మర్చిపోకండి."

సావిత్రి చేసిన పనికి ఇంటివాళ్ళు ఇంకా ఆశ్చర్యంలో వుండగానే నీరజ రాజేష్‌తో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి బయలుదేరింది.

దారిలో చెప్పింది. "రాజేష్ హాస్టలులో నా స్నేహితురాలు మీ నాన్న పేరేమిటని అడిగితే, సాంబశివరావు అని మాత్రం చెప్పకే.

"చెప్పకూడదా? అయితే అలాగే పిన్నీ"

నీరజ స్నేహితురాలు సహజ ఆమెకోసం ఎదురుచూస్తోంది."ఏమిటి ఈ సర్‌ప్రయిజ్?" అడిగింది సహజ స్నేహితురాలి చేతిని ఆప్యాయంగా పట్టుకుని.

"చిన్న పని తగిలింది"

"ఈ ఛార్మింగ్ బాయ్ ఎవరు?"

"నా పేరు కె.రాజేష్ కుమార్. సెకండ్ స్టాండర్డ్ చదువుతున్నాను" రాజేష్ తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"సహజ నా స్నేహితురాలు" నీరజ పెద్దవాళ్ళకి పరిచయం చేసినట్లు రాజేష్‌కి పరిచయం చేసింది.

"హలో ఆంటీ నైస్ టూ మీట్ యూ. ఐ లైక్ యువర్ వాయిస్" చెప్పాడు రాజేష్ ఉత్సాహంగా.

"థాంక్ యూ" నవ్వుతూ చెప్పింది సహజ.

"ప్లీజ్ డోంట్ మెన్షన్ ఇట్ ఆంటీ."

సహజ గది గోడలకి తగిలించి వున్న విరిగిన రంగురంగులతో గాజుముక్కలని వేడిచేసి వంచి తయారుచేసిన తోరణాలని చూసి అడిగింది నీరజ -

"ఇంకా నీకీ పిచ్చి పోలేదా?"

"అమ్మాయి హాస్టల్లో పగిలే గాజుముక్కలు దొరికినంతకాలం ఈ పిచ్చి ఎవరికో ఒకరికి వుంటూనే వుంటుంది. ఆయా రోజుకి నాలుగైదు గాజుముక్కలయినా తెచ్చిస్తూ వుంటుంది. హాస్టల్‌కి వచ్చాక చేసే పనేం వుండదుగా, ఫ్రెండ్స్‌తో గాసిప్ కొడుతూ చేస్తుంటాను."

తన హాస్టలు మేట్స్‌లో బాగా దగ్గరయిన నలుగురైదుగురికి నీరజని పరిచయం చేసింది సహజ. అంతా ఉద్యోగస్తులే.

రాత్రి మెస్‌లో భోజనానికి వెళ్ళేదాకా యిద్దరూ అనేక విషయాలు మాట్లాడుకుంటూవుండిపోయారు. భర్తను గురించి అడిగితే నీరజ అడిగిన ప్రశ్నకు మాత్రమే పొడిగా సమాధానం చెప్పటం గమనించింది సహజ. పెళ్ళయిన ప్రతి అమ్మాయి కనీస్మ అయిదారు నెలలుదాకానయినా తను భర్తగురించి ఎంతో ఉత్సాహంగా, ఆసక్తితో మాట్లాడటం ఆమెకు తెలుసు.

భోజనాలయ్యాక రాజేష్‌ను సహజ గదిలో వుంచి యిద్దరూ బయట గార్డెన్‌లో కూర్చున్నారు. కాసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

"ఇంత మంచి వాసన కాబట్టే దానికి నైట్‌క్వీన్ అని పేరు పెట్టారనుకుంటాను" చెప్పింది సహజ.

మరి కాసేపు నిశ్శబ్దం."రాజేష్ ఎవరు?" అడిగింది సహజ.

చిన్నగా నిట్టూర్చింది నీరజ. "రాజేష్ తన భర్త కొడుకు" అన్న సంగతి మాత్రం దాచి మిగతాదంతా వున్నదున్నట్టుగా చెప్పింది.

"సావిత్రి మామయ్యగారి దూరపు బంధువులట. ఒక్కణ్ణే పంపించింది. ఆయన సావిత్రిని కూడా తీసుకురమ్మని నన్నుపంపారు. సావిత్రి ఇల్లు తెలియదు కాబట్టి రాజేష్‌ని తోడుగా పంపారు."సావిత్రి ఇంటికి, స్కూలుకి వెళితే ఆమె ఎక్కడికి వెళ్ళినా తెలియలేదన్న సంగతి చెప్పింది నీరజ.

"ఇప్పుడు ఏం చెయ్యాలో పాలుపోవటంలేదు."

"సావిత్రి భర్త?"

"సావిత్రి భర్త మోసగాడు."

"అరే పాపం"

"అవును, పాపమే"

"అలా అకస్మాత్తుగా ఎందుకు మాయమయ్యింది?"

"అదే అంతు చిక్కడంలేదు."

"ఒకవేళ వైల్డు గెస్ అందాం. సావిత్రి ఇంకెవర్నయినా వంచించిందేమో" అనుమానాన్ని వ్యక్తం చేసింది సహజ.

కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పింది నీరజ.

"సావిత్రి అలాంటి మనిషి కాదు.""ఆమె నీకు ఇంతకుముందు తెలియదు కదా?"

"ఊహూ."

"కాదని ఎలా చెప్పగలిగావు?"

"పరోక్షంగా సావిత్రి గురించి నాకు బాగా తెలుసు. చక్కటి ప్రవర్తనగల రాజేష్‌లాంటి కొడుకుని తీర్చిదిద్దిన సావిత్రి ఎప్పటికీ తన సుఖం కోసం అలాంటి పని చెయ్యలేదు."

మరి కాసేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

"ఏదో జరిగింది, అందుకే సావిత్రి రాజేష్‌ని ఇంటికి పంపించింది. ఏం జరిగిందో వూహించగలను."

"ఏం జరిగింది?"

ఆ ప్రశ్నకి సమాధానం 'మా ఆయనకి నాతో వివాహం జరిగింది' సహజకి నీరజ చెప్పలేదు. మౌనంగా వుండిపోయింది.

నీరజ ఎంతో అనీజీగా వుండటం గమనించి చెప్పింది సహజ లేచి "పద వెళదాం"

ఇద్దరూ సహజ గదిలోకి వెళ్ళారు.

రాజేష్ నలుగురమ్మాయిల మధ్య కూర్చుని వున్నాడు.

ఆ అమ్మాయిలు రాజేష్ ముందుకి తమ చేతులు చాపి వుంచారు. రాజేష్ ఒన్, టూ, త్రీ చెప్పగానే అంతా తమ అరచేతులని అలాగే వుంచటమో లేదా గుప్పెటగా మార్చటమో చేస్తున్నారు.

"నౌ యూ ఆర్ అవుట్ ఆంటీ"

అందరి చేతులని జాగ్రత్తగా చూస్తున్న రాజేష్ చివర కూర్చున్న అమ్మాయితో చెప్పాడు.

"ఏమిటిది?" అడిగింది సహజ.

"మీ రాజేష్ ఓ కొత్త ఆట నేర్పించాడు" చెప్పింది పక్క గదిలో వుండే జయంతి.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in